www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 26 | నవంబర్ | 2024
పేజీలు 7

## 51 సంవత్సరాలుగా సిపిఐతో గోర్కి అనుబంధం



సిపిఐ గోర్కి ఆసుపత్రి శాఖ పునరుద్ధరణ

సెంటర్ స్ప్రెడ్



# వేడుకల వేళ.. రైతుల్లో అసంతృప్తి..!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా డిసెంబర్ ఒకటి నుంచి వారం రోజుల పాటు సంబురాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వేడుకల వేళ తెలంగాణ రైతాంగంలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. గత ప్రభుత్వం రైతులను విస్మరించిందని రైతాంగ సమస్యలను పట్టించుకోలేదన్న భావనతో రైతులు మూకుమ్మడిగా అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓట్లు వేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ గత ఏడాది ఎన్నికలలో రైతులను బాగా ఆకర్షించింది. రెండు లక్షల లోపు రుణమాఫీ, ఎకరానికి రూ. 15వేలు, రైతు బీమా రైతాంగాన్ని బాగా ఆకట్టుకున్నాయి. సన్న రకం ధాన్యానికి రూ. 500 బోనస్ రైతుల సానుకూలతకు కారణమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి రుణమాఫీని పూర్తి చేస్తామని ప్రకటించినప్పటికీ వాస్తవ పరిస్థితి తద్విరుద్ధంగా ఉంది.

-ప్రజాపక్షం/ఖమ్మం

వివరాలు.. 2లో

- రుణమాఫీ, రైతు భరోసాతోనే సంతృప్తి
- సంబురాల వేళకు సరి చేస్తారా...?

### భద్రాద్రిని అన్ని రంగాల్లో
## తీర్చిదిద్దాలన్నదే ఏకైక లక్ష్యం



- జిల్లా ప్రత్యేకాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందడుగు
- గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు
- మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట
- కొత్తగూడెంలో తుమ్మల విస్తృత పర్యటన

ప్రజాపక్షం/భద్రాచలం : తెలంగాణ రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పరంగా నిలపడమే కాకుండా ధనిక జిల్లాగా తీర్చి దిద్దడమే తన ఏకైక క్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం పర్యటనలో భాగంగా తొలుత నందా తండా నుండి

మిగతా 2లో..

## చిట్టీల, గిరిగిరి పేరుతో ప్రజలకు శఠగోపం..!

- -బడాబాబుల కనుసన్నల్లో రూ. లక్షల కోట్ల చిట్టీ, గిరిగిరి వ్యాపారం
- -అమాయక ప్రజల ఆశే వారి పెట్టుబడి
- -అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి



సెంటర్ స్ప్రెడ్

## రైతులతో కలెక్టర్ మాటామంతి



- -పంట కోత పరిశీలన
- -మహిళలు వ్యాపారవేత్తలుగా ఆలోచించాలి
- -మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కారమవ్వాలి

6లో

# వేడుకల వేళ రైతుల్లో అసంతృప్తి..!

ప్రజాపక్షం/ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా డిసెంబర్ ఒకటి నుంచి వారం రోజుల పాటు సంబురాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వేడుకల వేళ తెలంగాణ రైతాంగంలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. గత ప్రభుత్వం రైతులను విస్మరించిందని రైతాంగ సమస్యలను పట్టించుకోలేదన్న భావనతో రైతులు మూకుమ్మడిగా అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓట్లు వేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ గత ఏడాది ఎన్నికలలో రైతులను బాగా ఆకర్షించింది. రెండు లక్షల లోపు రుణమాఫీ, ఎకరానికి రూ. 15వేలు, రైతు బీమా రైతాంగాన్ని బాగా ఆకట్టుకున్నాయి. సన్న రకం ధాన్యానికి రూ. 500 బోనస్ రైతుల సానుకూలతకు కారణమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి రుణమాఫీని పూర్తి చేస్తామని ప్రకటించినప్పటికీ వాస్తవ పరిస్థితి తద్విరుద్ధంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.17వేల కోట్లు ఖర్చు చేశామని చెపుతున్నప్పటికీ రుణమాఫీ పట్ల రైతుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతూనే ఉంది. రెండు లక్షల పైబడి రుణం కలిగిన రైతులకు మాఫీ జరగకపోవడంతో ఆ రైతుల్లో అసంతృప్తి నెలకొన్నది. కాని రెండు లక్షల లోపు రుణాలు ఉన్న రైతుల్లో పూర్తి స్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రకరకాల కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల లోపు రుణమున్న 30 నుంచి 40 శాతం మంది రైతులకు రుణమాఫీ జరగలేదు. అధికార యంత్రాంగం ఫోటోలు తీయడం, రేషన్ కార్డు ప్రక్రియ, కుటుంబ వివరాలు తదితర వివరాలను స్వీకరించినప్పటికీ రుణమాఫీ జరగకపోవడంపై రైతులు ఆవేదనకు గురవుతున్నారు. మంత్రుల పరస్పర విరుద్ధ ప్రకటనలు, పూర్తి రుణమాఫీకి సంబంధించి తరచూ తేదీలు మారుతుండడం కూడా రైతుల ఆవేదనకు, అసంతృప్తికి కారణమవుతుంది. ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కూడా అమలు కాలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతుభరోసా రైతు ఖాతాల్లో జమ కాలేదు. రబీలో అవుతుందని భావించిన ఇప్పుడు అది కూడా ముందుకు రాకపోవడంతో ప్రభుత్వంపై కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.15వేల చొప్పున రైతు భరోసా అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఖరీఫ్‌లోనైనా అందిస్తుందని ఆశగా ఉన్నారు. వేడుకల వేళ రైతుబీమా, పంటల బీమా పై కూడా రైతుల్లో చర్చ సాగుతుంది. డిసెంబర్ తొమ్మిది నాటికి రైతు రుణమాఫీని పూర్తి చేయడం రబీకి రైతు భరోసాను అందించడం, పంటల బీమాను అమలు చేయడం తదితర కార్యక్రమాలను పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. అది అమలు చేయకపోతే రైతుల్లో అసంతృప్తి మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఉచిత బస్సు, గృహజ్యోతి లాంటి పథకాలు తప్ప మిగిలిన పథకాల అమలులో జాప్యం జరుగుతుందన్న భావన ప్రజల్లో నెలకొంది. సంబురాల సందర్భంగా ప్రభుత్వం మరికొన్ని పథకాల అమలుకు ఉపక్రమించాలని కోరుతున్నారు.

# భద్రాద్రిని అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలన్నదే ఏకైక లక్ష్యం




(మొదటిపేజీ తరువాయి)

వికలాంగుల కాలనీ వరకు నిర్మాణం చేపట్టనున్న బిటి రోడ్డు పనులకు కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఎంఎల్‌ఏ డా. తెల్లం వెంకట్రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.1.50 కోట్లతో కొత్తగూడెంలో నిర్మించిన గ్రంధాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రంధాలయాలు ప్రత్యక్ష దేవాలయాలని, రాష్ట్రంలో గ్రంధాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. గ్రంధాలయాల్లో ప్రధానంగా సమకాలిక అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఉంచడం వల్ల విద్యార్థులు, అభ్యర్థులకు ప్రయోజనం చేసూరుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 600 గ్రంధాలయాలు ఉన్నాయని, వాటిని పునరుద్దరించాలని, వాటిలో అవసరమైన పుస్తకాలతో పాటు ఫర్నీచర్, మౌళిక వసతులను సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వనరులకు నిలయంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్యారంగానికి ప్రాధ్యాత నిస్తూనే వైద్యంతో పాటు రహదారుల ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ఇది ఏజెన్సీ జిల్లా అయినందున ప్రత్యేక దృష్టితో గతంలో రెషిడెన్షియల్ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు కోసం తనవంతు కృషి చేసినట్లు చెప్పారు. గతంలో భద్రాద్రికి అమరావతి నుండి భద్రాచలం మీదుగా జగ్దల్పూర్ వరకు జాతీయ రహదారిని ఏర్పాటు చేశామని, మరో జాతీయ రహదారిని కొత్తగూడెం నుండి ఇల్లెందు మీదుగా హైదరాబాద్‌కు త్వరలో అందుబాటులోనికి తీసుకొస్తామని చెప్పారు. పాండురంగాపురం నుండి సారపాక వరకు రైలుమార్గం ఏర్పాటు కోసం కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తీసుకొస్తున్నామని, అదే కార్యరూపం దాల్చితే దక్షిణ అయోధ్య భద్రాచలం నుండి ఉత్తర భార దేశానికి అనుసంధానం ఏర్పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మామునూరు, ఆదిలాబాద్, కొత్తగూడెంలలో ఎయిర్‌పోర్ట్‌ల ఆలోచన చేస్తోందని, దీనికి సంబంధించి కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపడితే సింగరేణి, బిటిపిఎస్, నవభారత్, ఐటిసి, హెవీవాటర్ ప్లాంట్ వంటి పరిశ్రమలు ఉన్న ఈ ప్రాంతంలో అధిక ప్రయోజనాలు చేకూరతాయని చెప్పారు. దీని పై స్థల పరిశీలన చేసి ప్రతిపాదనలు కేంద్రానికి పంపినట్లు చెప్పారు. అదేవిధంగా గోదావరి నదిపై కట్టే పోలవరం ప్రాజెక్టు పూర్తయితే జల రవాణాలోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, గోదావరి నదిపై నౌకాయానం అందుబాటులోనికి వస్తే అతి తక్కువధరకే రవాణా సదుపాయం అందుబాటులోనికి వస్తుందన్నారు. ఈ జిల్లాలోనే అధికంగా ఆయిల్‌ఫామ్ పంట సాగు చేస్తూ రైతులు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఆయిల్ పామ్ ఇనిస్టిట్యూట్‌ను గంగెమెళ్లపాడులో ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. పాల్వంచకు సైతం మరో బైపాస్ రోడ్డు మంజూరైందని, దానికి త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపడతామని తెలిపారు. కొత్తగూడెంను తప్పకుండా కార్పోరేషన్ చేస్తామని, దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయంలో దీనిపై మాట్లాడామని, ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో జిల్లాను అభివృద్ధి పథంలో అగ్రభాగాన నిలపాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ రియాజ్, ఎస్‌పి రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, గ్రంధాలయ కార్యదర్శి అర్జున్, గ్రంథపాలకురాలు జి మణిమృధుల, ఎం నవీన్, మధుబాబుతో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా సిపిఐ : పోటు



ప్రజాపక్షం/కల్లూరు: సిపిఐ అనుబంధంగా ఉన్న ఏఐటీయూసీ కార్మిక సంఘాలు, మధ్యాహ్న భోజనం, గ్రామపంచాయతీ , స్వీపర్లు, హమాలీలు, అంగన్‌వాడి, ఆశ, వివో ఏలు, ఆసుపత్రి కార్మికులు తదితర రంగాలలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఎల్లవేళలా అన్ని సమయాలలో అండగా ఉంటుందని సిపిఐ జిల్లా పార్టీ కార్యదర్శి పోటు ప్రసాద్ పేర్కొన్నారు. వంద సంవత్సరాలుగా అనేక రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు అండగా ఉంటూ వారి హక్కులు విధులు బాధ్యతలు అమలుకు కృషిచేసి వారిని ఆదుకుంటుందని వివరించారు. కల్లూరు లోని మార్కెట్ కమిటీ ఆవరణలో సిపిఐ, ఏఐటియుసి అనుబంధ సంఘాల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ, రాష్ట్ర స్థాయిలో కార్మిక రంగాలలో పనిచేస్తున్న వారందరికి అండగా ఉంటూ పనిచేస్తుందని వారు పేర్కొన్నారు. కల్లూరు ప్రాంతంలో సిపిఐని ఆదరిస్తున్నారని వివరించారు. మండలంలో పలు రంగాలలో పనిచేస్తున్న కార్మిక సంఘాల వారు సిపిఐ మరియు ఏఐటియుసి నిరంతరం సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటిసి రాష్ట్ర కార్యదర్శి సింగి నరసింహారావు, జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివ రామకృష్ణ దండు ఆదినారాయణ, నిమ్మటూరు రామకృష్ణ, గాదె లక్ష్మీ నారాయణ, వేము రాంబాబు, దామాల దయాకర్‌రావు, పలు కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి సిఎం, మంత్రుల సంపూర్ణ సహకారం

**- పిల్లలను గ్రంథాలయాలకు పంపండి : ఎంఎల్‌ఏ కూనంనేని**




ప్రజాపక్షం/భద్రాచలం : కొత్తగూడెం నియోజకవర్గాభివృద్ధికి ముఖ్యమంత్రి తో పాటు మంత్రి వర్గం సంపూర్ణ సహకారం అందిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం నందా తండా నుండి వికలాంగుల కాలనీ వరకు నిర్మాణం చేపట్టనున్న బిటి రోడ్డులను ప్రారంభంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం రూ.1.50 కోట్లతో కొత్తగూడెంలో నిర్మించిన నూతన గ్రంధాయ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తుమ్మల, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి తో కలిసి పాల్గొన్న ఆయన అనంతరం నూతన గ్రంధాలయ ప్రాంగణంలో జరిగిన సభలో తొలుత మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులు రాబట్టి నియోజకవర్గంలో మౌళిక సదుపాయాల కల్పనకు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజల దీర్ఘకాలిక సమస్యలతో పాటు ఎన్‌ఎండిసి, మైనింగ్ యూనివర్సిటీ, కెటిపిఎస్, విద్యుత్ ప్లాంట్ వంటి ఏర్పాటు అంశాలను ప్రభుత్వం ముందు ఉంచామని, జిల్లా కేంద్రం అభివృద్ధి సాధించేందుకు మరింత దోహదపడుతుందని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సహకరించాలన్నారు. అనంతరం రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి గ్రంధాయాలకు ఎంతో అవినాభావ సంబంధం ఉందని, తెలంగాణ ఉద్యమానికి ఒకరకంగా గ్రంధాలయాలదే ప్రధాన భూమిక అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని గ్రంధాలయాలన్నింటినీ డిజిటల్ గ్రంధాలయాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, గ్రంధాలయ కార్యదర్శి అర్జున్, గ్రంథపాలకులు జి మణిమృధుల, ఎం నవీన్, మధుబాబుతో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హమాలీలుగా మారిన మహిళలు



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని కొర్లగూడెం ఐకెపి కొనుగోలు కేంద్రంలో 15 మంది సభ్యులుగా ఏర్పడి హమాలీ ముఠాగా తయారై రోజువారి వేతనాన్ని పొందుతున్నారు. గ్రామంలో 15 మంది స్వయం సహాయక సంఘాలలో ఉన్న పేద మహిళా సభ్యులు కుటుంబ పోషణ కొరకు రోజువారి వేతనాన్ని పొందుతూ ఉన్నారు. గత పది రోజుల నుంచి హమాలీలుగా ఉండి లారీ లోడింగ్ చేస్తున్నారు. ఆ విధంగా హమాలీల కొరతను తీరుస్తూ జీవన భృతిని పొందుతున్నారు. గ్రామంలో 15 మంది ముఠాగా తయారై జీవనం పొందుతూ రోజువారి వేతనం కుటుంబ పోషణకు అందుకుంటూ ఉండటంతో గ్రామస్తులు అధికారులు వారిని అభినందిస్తున్నారు.

# వన సంరక్షణ సమితి భవన నిర్మాణానికి స్థల పరిశీలన



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరులోని ఎంపిడీవో కార్యాలయ ఆవరణ పరిధిలో ఉన్న కేటాయించబడిన ఖాళీ స్థలంలో వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని నిర్మించేందుకు అటవీశాఖ అధికారులు స్థల పరిశీలన సోమవారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి విక్రమ్ సింగ్ మాట్లాడుతూ కల్లూరు, తల్లాడ మండలాలకు చెందిన వన సంరక్షణ సమితి సభ్యులు కు ఈ సమావేశ మందిరాన్ని త్వరలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టుతున్నట్లు వారు తెలిపారు. అటవీ శాఖ ప్రజల సౌకర్యార్థం ఈ సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. అటవీ సంరక్షణకు అటవీ హక్కులు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ రేంజ్ అధికారిని ఉమ, జోనల్ అధికారి బీమా, డిఆర్‌వో రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శిగా శివ కృష్ణ



ప్రజాపక్షం/జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన మూడవ జిల్లా మహాసభలో మండల పరిధిలోని పాపకొల్లు గ్రామ పంచాయతీ పెద్ద హరిజనవాడకు చెందిన గార్లపాటి శివకృష్ణను జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంలో ఉపాధి కోల్పోయిన నష్టపోయిన ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల భృతి, జీవిత బీమా, పెన్షన్ చలానా నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు అండగా ఉంటానని నా పైన నమ్మకుండి ఎన్నుకున్న జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సంఘాల బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ

**సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్**




**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజా సంఘాల బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో సోమవారం ప్రజా సంఘాల సంయుక్త సమావేశం శింగు నర్సింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సంఘాల బలోపేతం తక్షణ కర్తవ్యంగా భావించాలని అన్ని ప్రజా సంఘాల మహాసభలను పూర్తి చేయాలన్నారు. పాలక వర్గాలు అన్ని రంగాల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని రైతు కార్మిక, యువజన, మహిళా వ్యతిరేక ప్రణాళికను పాలకులు అమలు చేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతుందని పాలకులు ఎవరైనా కార్పొరేట్ సెక్టార్‌కు ఇచ్చిన ప్రాధాన్యత వ్యవసాయ రంగానికి ఇవ్వడం లేదన్నారు. రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బలమైన రైతాంగ ఉద్యమ నిర్మాణం జరగాలన్నారు. కార్మికుల పరిస్థితి దయనీయంగా తయారైందని అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల ఆదాయం తగ్గి ఖర్చులు పెరిగాయని ప్రసాద్ తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలకు నియంత్రణ లేదని మోడీ సర్కార్ సామాన్యులను పట్టించుకోకుండా పాలన సాగిస్తుందని ప్రసాద్ తెలిపారు. వామపక్షాల పోరాట ఫలితంగా వచ్చిన జాతీయ ఉపాధి హామీ చట్టానికి తిలోదకాలు ఇచ్చేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తుందన్నారు. రెండు దశాబ్దాలుగా జాతీయ ఉపాధి హామీ చట్టం కార్మికుల పాలిట వరంగా మారిందని కాని ప్రస్తుత ప్రభుత్వం కేటాయింపులు తగ్గించి వ్యవసాయ కార్మికులను ఇబ్బందులు పెడుతుందన్నారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలంటూ తొలిసారి అధికారంలోకి వచ్చిన మోడీ ఈ పదేళ్లలోనూ కోటి ఉద్యోగాల కల్పన చేయలేకపోయారని ఆయన ఆరోపించారు. రిటైర్‌మెంట్లే తప్ప రిక్రూట్‌మెంట్లు లేని ప్రస్తుత పరిస్థితుల్లో యువజన విద్యార్థి, మహిళా సంఘాల సంఘటిత పోరాటాలు అవసరమన్నారు. బలమైన ఉద్యమ నిర్మాణం జరిగినప్పుడే ప్రజా సంఘాలు బలపడతాయని ప్రసాద్ తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ, శ్రావణ్, రేసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విప్లవానికి దిక్సూచి ఫిడెల్ కాస్ట్రో




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సామ్రాజ్యవాద వ్యతిరేక తిరుగుబాటు విప్లవానికి దిక్సూచి ఫిడెల్ కాస్ట్రో అని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ తెలిపారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా ఫిడెల్ కాస్ట్రో తొమ్మిదవ వర్ధంతిని నిర్వహించారు.ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రావి శివరామకృష్ణ మాట్లాడుతూ గోరిల్లా పోరాటాలు నిర్వహించి స్వాతంత్ర్య ఫలాలు అందించిన విప్లవ వీరుడు ఫిడెల్ కాస్ట్రో అని తెలిపారు. 13 ఆగస్టు 1926 బైరాన్ క్యూబాలో జన్మించి 1969 నుండి 2008 వరకు క్యూబాను పాలించారన్నారు. క్యూబా నియంత బాటిస్టాన్‌ను సాయుధ పోరాటం ద్వారా తొలగించి అధికారం చేపట్టారని తెలిపారు. ఫిడెల్ కాస్ట్రోను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉద్యమించాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంజిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి శివకౌషిక్, నాయకులు హరికృష్ణ, రాజు, గోపి, నరేష్, ప్రతాప్, సాయిసందీప్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్లు**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఖమ్మం అర్బన్ మండలం రామన్నపేట గ్రామానికి చెందిన కూచిపూడి సన తన ఇల్లు వరదల్లో కొట్టుకుపోయిందని సెకండ్ లిస్టులో తన పేరు ఉందని తనకు ఇంత వరకు ఎటువంటి సాయం అందలేదని సాయం అందించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెంకు చెందిన కట్ల రమాదేవి తనకు ప్రభుత్వ ఆసుపత్రిలో మూడవ కాన్పు జరిగిందని బాబుకు బర్త్ సర్టిఫికెట్ జారీ చేయడం లేదని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని వెంటనే బర్త్ సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. వేంసూరు మండలం కొత్తచౌడవరం గ్రామానికి చెందిన జి.శ్రీను తనకు దివ్యాంగుల కోటాలో చిన్న ఉద్యోగం ఇప్పించాలని దరఖాస్తు చేశారు. కొణిజర్ల మండల కేంద్రానికి చెందిన కొర్లపాటి ధనమ్మ తనకు ఇంటి స్థలం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్లు వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బ్లూమింగ్ మైండ్స్‌కు ఉత్తమ పాఠశాల అవార్డు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డు లభించింది. ఎన్‌సిసి 76వ దినోత్సవ సందర్భంగా జెడి మరియు జెడబ్ల్యూ విభాగాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్ ప్రకటించిన వివిధ విభాగాలలో తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తమ విద్యా సంస్థగా ఖమ్మం నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాల కైవసం చేసుకుంది. ఎన్‌సిసి 76వ దినోత్సవ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని మెహిదిపట్నంలో గల మిలటరి గ్యరిసన్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సిసి ఏపి, తెలంగాణ డిప్యూటీ డైరెక్టరేట్ ఎయిర్ కమాండోర్ వివిన్ రెడ్డి చేతుల మీదుగా పాఠశాల కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కమాండోర్ వివిన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్దేలా 11 ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో బ్లూమింగ్ సంస్థను నిర్వహిస్తున్నందున ఉత్తమ పాఠశాల అవార్డును అందుకోవడం జరిగిందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో గల ఎన్‌సిసి, వ్యాయామ ఉపాధ్యాయులు చూపిస్తున్న చొరవ, విద్యార్థులు చూపిస్తున్న ప్రతిభ, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ, శిక్షణా శిబిరాలు నిర్వహించడం వల్లే ఈ అవార్డును పొందడం జరిగిందన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన అవార్డు తమ పాఠశాలకు దక్కడం ఎంతో గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఎన్‌సిసి బాధ్యులు పి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వ్యాధి నిరోధక టీకాలను అందుబాటులో ఉంచాలి



**ప్రజాపక్షం/ మధిర :** సంపూర్ణ వ్యాధి నిరోధక టీకాలు గ్రామాల్లో ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి తల్లి పిల్లలకు అందించాలని జిల్లా వ్యాక్సిన్ లాజిస్టిక్ మేనేజర్ చింతల వెంకటరమణ అన్నారు. మండల పరిధిలోని దెందుకూరు పిహెచ్‌సిని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా టీకాల నిల్వ కేంద్రంను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా సార్వత్రి వ్యాధి నిరోధక టీకాల స్టాక్ పొజిషన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్, హెచ్‌ఇఓ గోవింద్, ఆరోగ్య పర్యవేక్షకులు లంకా కొండయ్య, నర్సింగ్ ఆఫీసర్స్ సృజన, అరుణ, శ్రీనివాస్, ఎఎన్‌ఎం రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

# వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగం సంపాదించిన దేవిశెట్టి ప్రవళిక



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధిలోని జిలుగుమాడకు చెందిన దేవిశెట్టి కృష్ణ కూతురు దేవిశెట్టి ప్రవళిక మొన్న విడుదలైన గ్రూప్ 4 ఫలితాల్లో ఓపెన్ క్యాటగిరి ఉత్తీర్ణత సాధించి ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టెంట్ ఖమ్మం నందు ఉద్యోగం పొందారు. కృషి పట్టుదల ఉంటే విజయాన్ని సాధించవచ్చుననేదానికి ఉదాహరణ ప్రవళిక చిన్నతనం నుండే విద్యతలో చురుకుగా మందుంటూ టెన్త్ క్లాస్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఐఐటి బాసర నందు సీటు సాధించి ఈసిఈలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి గ్రూప్ 2 తన లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. గ్రూప్ 4 ఉద్యోగం సాధించిన ప్రవళికకు పలువురు అభినందనలు తెలిపారు.

# దేవాలయ భూములపై సర్వే



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** మండల కేంద్రంలోని శ్రీ రాజగోపాలస్వామి దేవాలయం కు చెందిన భూముల పై సోమవారం సర్వే ప్రారంభించారు. మండలంలోని సింగారెడ్డిపాలెం లో రెవిన్యూ పరిధిలో దేవాలయం కు 15.20 ఎకరాలు భూమి ఉంది. కాగా దేవాలయం కు చెందిన భూములు ఆక్రమణ కు గురవుతున్నట్లు పలువురు ఆరోపణలు చేశారు., ఈ నేపథ్యంలో సోమవారం దేవాదాయ శాఖ ఈవో శ్రీకాంత్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. దేవాలయం భూములకు సంబంధించిన భూమికి హద్దులు నిర్ణయించారు. పక్క నున్న రైతుల భూముల కు సంబంధించి పరిశీలించారు. పూర్తి స్థాయిలో భూమి విచారణ త్వరలో చేపడతామని సర్వే ను వాయిదా వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు..దేవాలయం భూములు ఆక్రమణ చెర నుంచి రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ఈవో శ్రీకాంత్, పూజారి రామానుజచార్యులు, రైతు ప్రతినిధులు పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, దోసపాటి శేఖర్, రాయపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర సర్వే డేటా ఎంట్రీని సకాలంలో పూర్తి చేయాలి



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** సమగ్ర సర్వే డేటా ను నిర్దేశించిన సమయం లోపు పూర్తి చేయాలని పాలేరు నియోజకవర్గ ఇంచార్జీ నూరుద్దీన్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే డేటా ఎంట్రీ నమోదు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..సమగ్ర సర్వే వివరాలు నమోదు లో ఎలాంటి తప్పులు దొర్లకుండా శర వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మండల స్తాయి అధికారులు పర్యవేక్షణ నిరంతరం ఉండాలని అన్నారు. సర్వే ను కూడ యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె.మానిక్‌రావ్, ఎంపీడీఓ యం.యర్రయ్య, విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, యంపీవో శివ, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంఎల్‌ఏ ఊకే అబ్బయ్య మృతి పట్ల పలువురి సంతాపం

**ప్రజాపక్షం/భద్రాచలం :** మాజీ శాసన సభ్యులు ఉయికే మృతి పట్ల భద్రాచలం సిపిఐ పట్టణ సమితి తీవ్ర సంతాపాన్ని, కుటుంబానికి ప్రఘాడ సానుభూతిని తెలిపింది. సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ మాట్లాడుతూ మూడు సార్లు ఎంఎల్‌ఏగా గెలుపొందిన అబ్బయ్య ప్రజలకు ఎనలేని సేవలు చేశారని చెప్పారు. చిన్ననాటి నుండి కమ్యూనిస్టు భావజాలాన్ని అలవర్చుకున్న ఆయన అతిపిన్న వయస్సులోనే ప్రజాప్రతినిధిగా ఎంపికయ్యారని, సిపిఐ తరుపున మూడు సార్లు పోటీ చేసిన ఆయన ఘన విజయం సాధించారని చెప్పారు. మృతి చెందిన ఆయన ఆత్మక శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీసాల భాస్కర్ రావు, మారెడ్డి శివాజీ, , ఎస్‌వివిస్ నాయుడు, వెంకటేశ్వరరావు, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సంయుక్త కిసాన్ మోర్చా ఎస్‌కేయం దేశ వ్యాప్త ఆందోళనలు నిరసనలో భాగంగా నేడు ఉదయం 11గంటలకు ఖమ్మం కలెక్టరేట్ ముందు నిరసన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ అన్నారు. సోమవారం ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కారేపల్లి, మాదారం గ్రామ పంచాయితీలో ప్రచారం నిర్వహించి, గోవింద్ తండా గ్రామ రైతులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 13 నెలల పాటు సాగిన ఢిల్లీ రైతాంగ కార్మిక ఉద్యమానికి బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన రైతాంగానికి నష్టం కలిగించే మూడు నల్లచట్టాలను, నాలుగు లేబర్ కోడులను రద్దు చేస్తానని, ఎంఎస్‌పి పండించిన పంటలకు కనీస మద్దతు ధర ప్రకటిస్తానని రైతాంగ సమస్యలన్నిటిని పరిష్కరిస్తానని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రైతాంగ ఉద్యమానికి లిఖిల పూర్వకంగా వ్రాసి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తిరిగి వాటిని ప్రవేశపెడుతూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, దీనిని దేశ ద్రోహ చర్యగా ప్రజలందరూ గుర్తించాలని అన్నారు. దేశాన్ని తాకట్టు పెట్టాలని చూస్తున్నారని దీనిని సకల జనులందరూ ముక్తకంఠంతో ఖండించి నేడు ఖమ్మంలో జరిగే ధర్నా నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు బి వీరు, వై జానకి, గ్రామ రైతులు బర్మావత్, భద్రాజి, బాలు, వీరు, కిట్టు, చాంప్ల తదితరులు పాల్గొన్నారు.

## కిటకిటలాడిన శివాలయాలు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్లలో శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి సహిత ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం , కొణిజర్లలోని కట్టుభోగలింగేశ్వరాలయం, పల్లిపాడులోని శంభులింగేశ్వరాలయం, రెడ్డిగూడెంలోని రామలింగేశ్వరాలయంలో కార్తీక సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసంలోని ఆఖరి సోమవారం కావడంతో భక్తులు ఆలయాలకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెల్లవారుఝామునుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని అభిషేకాలు చేశారు. మహిలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజాకార్యక్రమంలో పాల్గొని వత్తులు వెలిగించారు. తనికెళ్ల శివాలయం ప్రాంగణంలో అయ్యప్ప మాలధారులు 220 మంది స్వాములు ఉండటంతో స్వాములు తోపాటు భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించడంతో ఆలయప్రాంగణం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది. తనికెళ్ల శివాలయంలో పైజారి కాశావఝుల ప్రసాదశర్మ ఆలయంలో అభిషేకాలు , ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

## మాలమహానాడు సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** హైదరాబాద్ నగరంలో డిశంబర్ 1 న జరగబోయే మాలమహానాడు సభను జయప్రదం చేయాలని మాలమహానాడు సంఘం జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం అన్నారు. మండల కేంద్రం కొణిజర్లలో సోమవారం వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి రాష్ట్ర కోచైర్మన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ముఖ్య సలహాదారు మోటపోతుల బాబూరావు అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతు మాలలంతా ఐక్యంగా ముందుకు సాగి మరో పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కోచైర్మన్ గౌరవ సలహాదారు లింగాల రవికుమార్ , రాష్ట్ర కోకన్వీనర్ దామాల సత్యనారాయణ , లాయర్ ప్రకాష్ , స్థాణిక నాయకులు కాశిమల్ల సతీష్ , కొనకంచి మోష , తలారి రాములు , కొనకంచి శాంతకుమార్ , పోతురాజు ప్రసాద్ , కాల్వకట్ట వెంకటరత్నం , కాల్వకట్ట జాన్ , ముల్లగిరి ఆనందరావు , పియోనా , కొప్పుల రామారావు , ముత్తమాల బాబూరావు , పలువురు గ్రామ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## అటవీ రక్షణ, వన్యప్రాణి సంరక్షణలో ఎక్కడ రాజీ పడొద్దు



**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్:** అటవీ రక్షణ, వన్యప్రాణి సంరక్షణలో ఎక్కడ రాజీ పడొద్దని, నిరంతర గస్తీ నిర్వహంచి అటవీ ఆక్రమణ కాకుండా జాగ్రత్త వహించాలని కిన్నెరసాని డివిజన్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీర్ బి బాబు అన్నారు. సోమవారం డివిజన్ లెవెల్ క్షేత్రస్థాయి సిబ్బందితో ఆయన రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల ప్రాముఖ్యత గూర్చి ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. విధులలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నర్సరీలు, ప్లాంటేషన్‌లలో పనులు సకాలంలో పూర్తచేయాలని తదుపరి ఫీల్డ్ విజిట్‌లో భాగంగా గట్టుమల్ల, బంగారు చేలక నర్సరీలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో రేంజ్ అధికారులు పి కనకమ్మ, ఎన్ కిరణ్‌కుమార్, కవిత, మాధూరి, సెక్షన్ అధికారి శ్రీనివాస్, బీట్ అధికారి శోభన్‌బాబు, డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

# 51 సంవత్సరాలుగా సిపిఐతో గోర్కి అనుబంధం

### సిపిఐ గోర్కి ఆసుపత్రి శాఖ పునరుద్ధరణ







**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంజిల్లాలో తొలుత కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా మారిన అతి కొద్ది మందిలో పారుపల్లి రామయ్య ఒకరు. బోనకల్ మండలం రాయన్నపేట గ్రామానికి చెందిన పారుపల్లి రామయ్య, సర్వదేవభట్ల రామనాథం, రావెళ్ల జానకిరామయ్య తదితరులతో కలిసి తొలి దశలోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా చేరారు. తుది శ్వాస వరకు కమ్యూనిస్టుగా జీవించడమే గాక చుట్టు పక్కల గ్రామాల్లో బలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారు. ఆయన వారసుడే డాక్టర్ పారుపల్లి గోర్కి. వైద్య వృత్తిలో ఉన్న గోర్కి 1971లో భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా చేరారు. అప్పటి నుండి ప్రతి ఏడాది సభ్యత్వాన్ని పునరుద్ధరించుకుంటూ కమ్యూనిస్టు ఉద్యమానికి బాసటగా నిలిచారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత వేళ సోమవారం సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ నుంచి పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఎప్పటి నుంచో ఉన్న గోర్కి ఆసుపత్రి శాఖను పునరుద్ధరించారు. శాఖ సభ్యులందరూ భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమానికి దన్నుగా నిలుస్తున్న డాక్టర్ గోర్కిలాంటి వారి మద్దతు పార్టీ బలోపేతానికి ఆవశ్యమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోర్కి సహా సభ్యులందరికీ అభినందనలు తెలిపారు.

**సభ్యత్వాన్ని పునరుద్ధరించుకున్న డాక్టర్ వై. ప్రసాద్...**

ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు, భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులు డాక్టర్ వై. ప్రసాద్ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సోమవారం పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. వై. ప్రసాద్ తండ్రి యరమల వెంకటనర్సయ్య , తల్లి యరమల రాజమ్మ సాయుధ తెలంగాణ పోరాట యోధులు, భారత కమ్యూనిస్టు పార్టీ పక్షాన బహుముఖ పోరాటాలు నిర్వహించిన నాయకులు. ఆయన వారసుడిగా విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమంలో పని చేసిన డాక్టర్ వై. ప్రసాద్ కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, ప్రజా సంఘాల బాధ్యులు మద్దోజు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా కొనసాగుతున్న సిపిఐ సభ్యత్వాలు



**ప్రజాపక్షం/పాల్వంచ:** మండల పరిధిలోని నాగారం, రేపల్లెవాడ 2025 సభ్యత్వాలు సిపిఐ 100 సంవత్సరాల వారోత్సవాల సందర్భంగా ఇంటింటికి సిపిఐ చరిత్ర తెలియజేస్తూ 40 సభ్యత్వాలు పూర్తి చేసి చంచలపురి శ్రీనివాసరావు, సాయిలి శ్రీనివాసరావు, బానోత్ రంజిత్, ఎర్రగోర్ల ధనమ్మ, సాయి వెంకన్నలు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సిపిఐ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబాకు అందజేశారు. ఈసందర్భంగా వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, వైయస్ గిరి తదితరులు పాల్గొన్నారు.

**తోగ్గూడెం....**

ల్వంచ మండల పరిధిలోని తోగ్గూడెం సిపిఐ 2025 సభ్యత్వాలు 40 పూర్తి చేసి కౌంటర్ ఫైల్‌తో సహా జరుపుల మోహన్, బాదావత్ శ్రీను, జరుపుల కిషన్‌లు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబుకు అందజేశారు. ఈసందర్భంగా వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యురాలు వీసంశెట్టి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, ఎస్‌పి రహిమాన్, ఎస్‌కే కరీం, ఎస్‌కే ఖాజా లాల్ పాషా, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిట్టీల, గిరిగిరి పేరుతో ప్రజలకు శఠగోపం..!

**-బడాబాబుల కనుసన్నల్లో**
**రూ. లక్షల కోట్ల చిట్టీ, గిరిగిరి వ్యాపారం**
**-అమాయక ప్రజల ఆశే వారి పెట్టుబడి**
**-అక్రమ గిరిగిరిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**



**ప్రజాపక్షం/కరకగూడెం:** పచ్చని పల్లెల్లో చిట్టీల దందా కొనసాగుతోంది. అక్రమ చిట్టీలు, గిరి గిరి వ్యాపారాలతో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని మండల ప్రజలు పలువురు ఆరోపిస్తున్నారు. లక్ష నుంచి మొదలు రూ. 20 లక్షల వరకు చిట్టీ వ్యాపారాలు కొనసాగిస్తూ అక్రమ సంపాదనే ధ్యేయంగా కొందరు ఘనులు అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ఎటువంటి అనుమతులు లేకుండా ఇదే అదునుగా తమను అడిగే వారు లేరన్న ధీమాతో ఇలా చిట్టీలు, గిరి గిరి దందాను కొనసాగిస్తున్నారు. ఏదో తమ అవసరం తీరుతుంది కదా అని చిట్టీలు, గిరిగిరి వేస్తే అమాయక ప్రజలను ముప్పు తిప్పలు పెడుతూ వారి డబ్బుతోనే అక్రమంగా లక్షల రూపాయలు సంపాదిస్తూ వారికి శఠగోపం పెడుతున్నారు. ఈ అక్రమ చిట్టీ వ్యాపారాలపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కరకగూడెం మండల పరిధిలోఅనుమతులు లేని చిట్టీలు, గిరి గిరి వ్యాపారాలు నిర్వహిస్తూ ''మీరు చిట్టీ వేయండి మీకు అదనంగా డబ్బులు ఇస్తామని'' సాకుతో లక్షల రూపాయల చిట్టి కట్టించుకుంటూ కట్టించుకున్న తర్వాత అమాయక ప్రజలను ముప్పు తిప్పలు పెడుతూ మూడు చెరువుల నీళ్లు త్రాగిస్తున్నారు. ''అయ్యా మా డబ్బులు మాకు ఇవ్వండి కాయ కష్టం చేసి, రూపాయి కూడా పెట్టి చిట్టి వేశాం మమ్మల్ని మోసం చేయకండి'' అంటు చిట్టీలు కట్టిన వారు అక్రమ చిట్టీల వ్యాపారస్తులకు దండాలు పెడుతున్నా వారి మాటలను సైతం లెక్కచేయకుండా అంగ బలం ఉందనే సాకుతో అమాయక ప్రజలను మోసం చేస్తూ ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. మణుగూరు, పినపాక, సీతంపేట, ఆంధ్ర నుండి మండలానికి వచ్చే మండలానికి చెందిన బడా బాబుల కనుసన్న లోనే అక్రమ చిట్టీల దందా జోరుగా సాగుతోందనే చెప్పాలి.

**కరకగూడెం ఎస్సై వివరణ...**




ఈ విషయమైన కరకగూడెం ఎస్సై రాజేందర్‌ను వివరణ కోరగా మండలంలో గిరి గిరి చిట్టిలు నడిపే వాళ్లపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలోకి గిరిగిరి చిట్టీలు నడిపే వారు వేరే మండలం వారు వచ్చి ఎవరైనా కనపడితే నాకు వెంటనే తెలియజేయాలని ఎస్సై రాజేందర్ తెలిపారు.

# యాసంగి సాగుకు సన్నద్ధం..!



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** యాసంగి సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. వానకాలం వరి కోతలు కోసిన రైతులు ధాన్యం అమ్మకంలో బిజీగా ఉన్నపట్టికీ యాసంగి సీజన్ ఆరంభమైన నేపథ్యంలో సాగుకి సన్నద్ధమతున్నారు. ఈ సమయంలో నార్లు పోసుకుంటే తెగుళ్లను తట్టుకోవడంతో పాటు చలి ప్రారంభం కాకముందే నారు ఏపుగా పెరుగుతుందన్న నమ్మకం రైతుల్లో ఉంది. దీంతో యాసంగి సీజన్ వరి నారు పోసుకునే పనిలో నిమగ్నమయ్యారు. బోర్లు బావి కిందా పంటను పండించే రైతులు ఇప్పటికే పొలాలను దున్నకుని నారుమడులు సిద్ధం చేసుకున్నారు.

**సన్నాల సాగుకు రైతులు మొగ్గు...**

మండలంలో అత్యాధికంగా రైతులు సన్నరకాలైనా జీనెక్స్ సీడ్ చిట్టి పొట్టి చింట్లు,హెచ్‌ఎంటి, ఎంటీయు 1271, కావేరి చింట్లు, పద్మ హెచ్ ఎంటి లు వంటి తదితర సన్నాల వరిని రైతులు మండలంలో సాగుచేస్తున్నారు..పంట దిగుబడి కూడా దొడ్డు రకం కంటే ఎక్కువ వస్తుందని రైతులు పేర్కున్నారు. ప్రస్తుత యాసంగిలో కూడా సన్నాల సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నాట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచానా వేస్తున్నారు. మండల వ్యాప్తంగా 38,000.ఎకరల వ్యావసాయ భూమిలో 27,000. ఎకరలో వరిని మిగిలిన 11,000 లో చెరుకు, పత్తి, మిరప, పెసర వివిధ రకాల పంటలు సాగుకానున్నట్లు వ్యవసాయ అధికరుల అంచనా.

దిగుబడి బాగా వచ్చింది. వానాకాలంలో ఏడు ఎకరాల్లో పద్మా హెచ్ ఎంటి రకం సాగు చేశాను. ఎకరానికి 40 నుంచి 45 బస్తాల వరుకు దిగుబడి వచ్చింది. పచ్చిమీదనే వరి కోసి ట్రాక్టర్ బోరెం ద్వారా నేరుగా మిల్లుకు తీసుకుపోయి అమ్ముకున్నా.క్వింటాకు రూ. 2400లకు కొన్నారు. దొడ్డు రకం ఆమ్మలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. బాలిన కృష్ణంరాజు, రైతు, భైరవునిపల్లి.




మండలంలో ఏటేటా సన్నాల సాగు పెరుగుతుంది. చిట్టి పోట్టి చింట్లు, 101 చింట్లు, కల్కి హెచ్ ఎంటి లు తదితర రకల సన్నాల సాగుచేస్తున్నారు. దిగుబడి కూడా మంచిగానే వస్తుంది. యసంగిలో కూడా సన్నారకం సాగు పెరిగే ఆవకాశం ఉంది. యం.రాధ. ఏఓ నేలకొండపల్లి.

# వ్యాపారవేత్త హరిబాబుకు ఉత్తమ అవార్డు



**ప్రజాపక్షం/పాల్వంచ:** తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లాలో జరిగిన స్వేరో ఏడవ జాతీయ కన్వెన్షన్‌లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన ఏరో సంస్థల అధినేత తాళ్లూరి హరిబాబు ఉత్తమ వ్యాపారవేత్త అవార్డు అందుకున్నారు. సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హరిబాబుకు ఉత్తమ వ్యాపారవేత్త పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ని అవాంతరాలైనా ఎదుర్కొని వెనకడుగు వేయకుండా హరిబాబు అంచలంచెలుగా ఎదిగిన తీరు నేటి యువతకు ఆదర్శప్రాయం అన్నారు. హరిబాబు తన తెలివితేటలతో అంచలంచెలుగా ఎదుగుతూ నలుగురికి ఉపాధిని చూపిస్తూ నేడు మేము ఎవరికి తక్కువ కాదు అని నిజం చేశారని, ఒక స్వేరోగా హరిబాబు ఉత్తమ వ్యాపారవేత్త అవార్డు అందుకోవడం మనందరికీ గర్వకారణమని అన్నారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీతో తన వ్యాపారాన్ని ప్రారంభించి నేడు స్వయంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి నర్సింగ్ కళాశాలకు అనుమతిని తీసుకొచ్చి తన సొంత ఊరైన పాల్వంచలో నర్సింగ్ కళాశాల ప్రారంభించడం సంతోషిదాయకమని కొనియాడారు. అనంతరం హరిబాబు మాట్లాడుతూ మొక్కవోని ధైర్యం వెనకడుగు వేయని పట్టుదల ఉంటే ఈ ప్రపంచంలో మనకు అసాధ్యం అంటూ ఏమీ లేదు అని, నేడు ఉత్తమ వ్యాపారవేత్తగా చాలా ఆనందంగా ఉందని, నన్ను అనుక్షణం ప్రోత్సహిస్తూ తమ విలువైన సలహాలు సూచనలు అందిస్తూ సహకరించిన సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ అవార్డు అందుకోవడానికి సహకరించి నా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పునీతులు పౌలు పేతురు దేవాలయ వార్షికోత్సవ మహోత్సవం






**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రంలోని రోమన కతోలిక మిషన్(ఆర్‌సియం)పునీతులు పౌలు, పేతురు దేవాలయ 13వ వార్షికోత్సవ మహోత్సవాన్ని సోమవారం రోమన్ కతోలిక మిషన్ చర్చి ఆళ్లపల్లి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కూరపాటి యాకోబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ మహోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు చర్చిల్లో పని చేస్తున్న విచారణ గురువులు హాజరయ్యారు. సీనియర్ గురువు రెవరెండ్ మేడికొండ ప్రాన్సిస్, గోవా శౌరయ్యలు దివ్యబలి పూజ సమర్పణ చేశారు. రెవరెండ్ ఫాదర్ జ్వానేస్ పునీత పేతురు, పౌలు దేవాలయ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా క్రైస్తవ భక్తులకు సందేశం అందించారు. పౌలు అనగా చిన్నవాడిగా, పేరుతు అనగా బండరాయి, క్రీస్తు ప్రభువు వెంట వారి పరిచర్యల గురించి ప్రేమ, దయ, కారుణ్యం, సహనం, ఓర్పు, పట్టుదల, దేవుని యందు భయభక్తులు కలిగి జీవించాలని, బండపై పునాదుతో కట్టిన గృహం గట్టిగా ఉన్నట్లుగానే ఆ క్రీస్తు ప్రభువు పట్ల భయభక్తులు విశ్వాసం నమ్మిక ఉన్నప్పుడు ఎన్నో దీవెనలు ఆశీర్వాదాలు కలగుతాయని క్రైస్తవులకు, ప్రజలకు బోధించారు. పలు ప్రదేశాలలో విచారణలో ఉండి విచ్చేసిన 14 మంది విచారణ గురువులు స్థానిక గురువు యాకోబును ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో రెవరెండ్ గురువులు జోజప్ప, మ్యారియో, వినయ్ బాల అనిల్ జే ఆనంద్ ప్రేమ్ జయరాజు, ఆగస్టిన్, శౌరి, సుధాకర్, దీన సేవా సభ డిఎస్‌ఎస్ సిస్టర్స్ మేరీ చందాల్, దామరిస్, హెచ్‌ఎం సిస్టర్ మహిత, జ్యోతిర్మయి యానిమేటర్ పరమ ప్రభాకర్, ఉపదేశి మధారయ్య, సంఘ నాయకులు కామల్ల రాంబాబు, నాగేశ్వరరావు, రామ్మూర్తి, అంతోని, యువజన నాయకులు మద్దెల నవీన్, జీవన్, జోజీ, బన్నీ, మరియ దళం మహిళా నాయకులు పరమ సులోచన, రుక్మిణి, లలిత, అన్నపూర్ణ, రాజి, మంగ, ఏసుమని, జయమ్మ, సునీత, మౌనిక థెరీసా, మౌనిక, విజయలక్ష్మీ, రమణ, కమల, కనకలక్ష్మీ, పాస్టర్ అశోక్, ఇమ్మానేయేల్, సిఎస్‌ఐ పాస్టర్ రెవరెండ్ ఏసుపాదం, రెవెన్యూ గిరదవరి రామయ్య, పుష్కరాజు, ప్రవీణ్, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో జమలారెడ్డి ఆధ్వర్యంలో కళాయాత్ర



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మండల పరిధిలో ఎంపీడీవో జమలారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు విజయోత్సవ కళాయాత్ర నిర్వహించారు. బూర్గంపాడు సెంటర్, మిల్లు సెంటర్, మోరంపల్లిబంజర్, సారపాక సెంటర్‌లో కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై కళాకాలు అద్భుతమైన పాటలు పాడి ప్రజలను చైతన్య పరిచారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు గ్రామ పంచాయితీ ఈవో బర్ల ప్రభాకర్, మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీ సెక్రటరీ భవాని, ప్రజలు, సాంస్కృతిక సారథి కళాకారులు బాలు, కాంపెల్లి గోవింద్, గురవయ్య, షేక్ ముసా, డప్పు నరేంద్ర, స్నేహ, కౌసర్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

## మోతెగడ్డ వీరభద్రుడిని దర్శించుకున్న బిక్కసాని, వల్లూరిపల్లి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని మోతెగడ్డలో కొలువై ఉన్న వీరభద్ర స్వామి ఆలయాన్ని బూర్గంపాడు సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఇరవెండి మాజీ ఎంపీటీసీ సభ్యులు వల్లూరి వంశీకృష్ణ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని దర్శించుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కరి వసంతరావు, ఐతరాజు సీతారామరాజు, గుదే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల వాడకం తగ్గించాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** పంట చేలాలో ఎరువులు పురుగు మందు వాడకాలను తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు మహిళా రైతులకు సూచించారు. ములకలపల్లి జిఎస్ కాన్వెంట్ సిస్టర్స్ మహిళా రైతుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూసార పరీక్షలను విధిగా నిర్వహించుకోవడం ద్వారా ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చని అన్నారు. ఇంటిలోని కూరగాయల వ్యర్థాలను కాంపోస్టరుగా తయారు చేసుకోవచ్చు అని, సేంద్రియేలా ఎరువుల వాడకం ద్వారా దిగుబడి సాధించవచ్చు అని అన్నారు. మునగ సాగు లాభదాయకమని, రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి చేకూరడంతో పాటు ఈ ఏడాదికి ఎకరానికి లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో సిస్టర్ నిర్మల, సంఘ ఛైర్మన్ ఈశ్వరి, కార్యదర్శి సుశీల, మహిళా రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు బాబురావు




**ప్రజాపక్షం/ములకలపల్లి :** బడుగు బలహీన వర్గాల పీడిత కార్మిక కర్షక వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అలు పెరగని పోరాటాలను చేసి అమరుడైన అయితా బాబురావు ప్రజల హృదయాలలో చిరస్థాయి గా నిలిచిపోయి చిరస్మనీయుడైనరని సిపిఐ మండల కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్, సహాయ కార్యదర్శి నరాటి రమేష్‌లు అన్నారు. సోమవారం ఐదవ వర్ధంతిని పురస్కరించుకొని ములకలపల్లి మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రెస్ క్లబ్ పక్కన ఉన్న బాబురావు స్మారక స్థూపం వద్ద యూసఫ్ పార్టీ జెండాను ఆవిష్కరించి, ఆయన సేవలను కొనియాడారు. పార్టీ కార్యకర్తలు, కార్మిక నాయకుల సమక్షంలో బాబురావుకు ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల సీనియర్ నాయకులు నరాటి సత్యం, అనుముల సాయి, హమాలి నాయకులు, ఏఐటియూసి నాయకులు నకిరేకంటి పుల్లారావు, సాగర్, రావుల రమేష్, పెట్టి ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్ర



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి పర్యవేక్షణలో బొమ్మెర ముత్యం కళాబృందం ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్ర ఆళ్లపల్లి మండలంలోని వివిధ పంచాయితీలలో నిర్వహించారు. ప్రభుత్వం అందించే పథకాలు ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పిస్తూ, రైతు భరోసా, రూ 500లకే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, స్వయం సహాయక బృందాలకు ఇంటింటికి కుటుంబ సమగ్ర సర్వే, యువతకు ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇల్లు తదితర అంశాలపై ఆట పాటలతో అవగాహన కల్పించారు. కళాకారులు పమ్మి రవి, పాగి వెంకన్న, వెంకట్, నకిరికంటి, గుగులోతు నీల, అమెరికా హుస్సేన్, తదితరులు ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు పార్టీలో ఏఐఎస్‌ఎఫ్ పాత్ర ఎనలేనిది

**-ఉద్యమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలి**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** 100 ఏళ్ల ఘనమైన చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)లో ఏఐఎస్‌ఎఫ్ పాత్ర ఎనలేనిదని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. సోమవారం పార్టీ సభ్యత్వాలను ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి నాయకులకు సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని దీనిలో ఏఐఎస్‌ఎఫ్ పాత్ర ఎనలేనిదన్నారు. దేశ సంగ్రామంలో ఎంతో మంది విద్యార్థులు ప్రాణ త్యాగం చేశారని విశాఖ ఉక్కు ఆంధ్రా హక్కు అంటూ మహోద్యమంలో విద్యార్థులు ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా పోరాడారన్నారు. ఈరోజు విద్యా రంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ విద్యార్థుల గొంతుకగా ఏఐఎస్‌ఎఫ్ నిలిచిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రో ధరలు, కార్మికులకు కష్టం కలిగిన వారి తరుపున నిలబడి పోరాడే పార్టీ కేవలం భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డుల కోసం, పింఛన్ల కోసం రైతులకు రైతు భరోసా, రుణమాఫీ వంటి వాటి కోసం గొంతు విప్పి ప్రశ్నించగలిగేది ఎర్ర జెండా నాయకులేనన్నారు. 100 ఏళ్ల సిపిఐ ఆవిర్భావ వేడుకలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని ఇందులో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఖమ్మంజిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి శివకౌషిక్, నాయకులు హరికృష్ణ, రాజు, గోపి, నరేష్, ప్రతాప్, సాయిసందీప్, పవన్, రాజు, రవి, గణేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులతో కలెక్టర్ మాటామంతి

**పంట కోత పరిశీలన**





**ప్రజాపక్షం/తల్లాడ :** పొలం గట్టుపై కూర్చుని రైతులతో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాటామంతి చేపట్టారు. స్వయంగా వరి పంట కోతలను పరిశీలించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తల్లాడ మండలంలో పర్యటించి మంగాపురంలో ఉన్న తమ్మిశెట్టి లక్ష్మి నర్సయ్య రైతు పొలంలో జరుగుతున్న వరి పంట కోతను పరిశీలించారు అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వరి కోత మిషన్‌పై కూర్చుని ప్రత్యక్షంగా కలెక్టర్ కోతలను పరిశీలించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పొలం గట్టుపై కూర్చుని రైతులతో కలిసి ముచ్చటించారు. సాగునీటి వసతి ఎలా ఉంది, విద్యుత్ సమస్యలు ఉన్నాయా, త్రాగునీటి సరఫరా జరుగుతుందా వంటి అంశాలను ఆరా తీశారు. ధరణికి సంబంధించి సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో జరిగే విద్యార్థుల కోసం ప్రభుత్వం అవసరమైన వసతులు కల్పిస్తుందని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం పంట విస్తీర్ణం, వస్తున్న దిగుబడి, కొనుగోలు ప్రక్రియ ఎలా జరుగుతుంది, వరి కోత యంత్రం గంట సమయానికి ఎంత విస్తీర్ణంలో పంట కోత జరుగుతుంది. ఎంత డబ్బులు అవుతాయి వంటి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏవో ఎండి తాజుద్దీన్, ఏఈవోలు మురళి కృష్ణ, సాయికుమార్, శివకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వ్యాపారవేత్తలుగా ఆలోచించాలి...**

స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపార వేత్తలుగా ఆలోచన చేసి యూనిట్లను లాభదాయకం చేయడానికి చర్చించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం తల్లాడ మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్రింద ఏర్పాటు చేసిన దేవహత్రేయ ఫ్యాన్సీ, జనరల్ స్టోర్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. జనరల్ స్టోర్ నిర్వహకులు దేవసుధాని స్టోర్‌లో ఏమేమి వస్తువులు అందుబాటులో ఉంచారు. ఎంత రుణం తీసుకున్నారు, వ్యాపార అనుభవం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో డిమాండ్ ఉన్న వస్తువులను విక్రయించాలని, వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. లాభదాయకంగా స్టోర్ నడిచేలా అధికారులచే అందాల్సిన సహాయ సహకరాలు అందుతాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం అంజనాపురం గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి స్వయం సహాయక సంఘాల మహిళలతో కూర్చుని మాట్లాడారు. వెదురుతో చాటలు, బుట్టలు, చేతి విసనకర్ర, అలంకరణ సామగ్రి తయారీని పరిశీలించారు. ఖమ్మం టిటిడిసి సమీపంలో డ్వాక్రా బజార్ త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఇట్టి ఉత్పత్తులను డ్వాక్రా బజారులో నేరుగా విక్రయిస్తే లాభసాటిగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

**మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కారమవ్వాలి...**

మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు మండలాల్లోనే పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తల్లాడ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజలను అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లాడ మండలంకు సంబంధించి కలెక్టరేట్‌కు గత ప్రజావాణిలో 19 దరఖాస్తులు వచ్చాయని 10 దరఖాస్తులు మండల స్థాయిలోనే పరిష్కారం అయ్యేవని కలెక్టర్ తెలిపారు. మండలంలో సర్వే ప్రక్రియ పురోగతిపై ఆరా తీశారు. డేటా నమోదు నాణ్యతతో చేయాలని సంబంధిత ఎన్యూమరేటర్లను డేటా నమోదులో భాగస్వామ్యం చేయాలన్నారు. మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన కార్యక్రమాల గురించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో చంద్రమౌళి, ఇంచార్జి తహసీల్దార్ వనజ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని స్నానాల లక్ష్మీ పురం గ్రామంలో ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సోమవారం ప్రారంబించారు. అనంతరం కళ్యాణలక్ష్మి , శాదీముబారక్ , సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయనమ మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలో ప్రజాసంక్షేమం దిశగా నడుస్తుందని అన్నారు. రైతులకోసం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి క్వింటాకు 500 రూపాయలు బోనస్‌గా ఇస్తు రైతుసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. రైతు ఎప్పుడు కన్నీరు పెట్టకూడదని ఆలోచించి ఆనాడు రాహుల్‌గాంధీ ఏదైతే హామిని చ్చారో ఆ హామిని తప్పుకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క నాయకత్వంలో రైతులపక్షాన పనిచేస్తున్నట్లు తెలిపారు. ఒక్క వైరా నియోజకవర్గంలోనే ఇప్పటికి 7 నుంచి 8 సార్లు కళ్యాణలక్ష్మి , శాదీముబారక్ , సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందించడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ఎల్లవేళలా అందుబాటులో ఉండే విధంగా రవాణ వ్యవస్థను మెరుగుపరిచినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పాటు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రేస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి , పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు , పట్టణ కాంగ్రేస్ అధ్యక్షుడు ఏదునూరి సీతా రాములు , దొడ్డా పుల్లయ్య, యడ్లపల్లి వీరయ్యచౌదరి , బోళ్ల రంగారావు , వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రేస్ అధ్యక్షుడు పమ్మి అశోక్ , మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ బిడికె రత్నం , మల్లు రామకృష్ణ , మట్టూరి కృష్ణారావు , పొట్లపల్లి శ్రీను , మచ్చ వెంకటేశ్వరరావు (బుజ్జి) , రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ దర్జీచెన్నారావు, చింతనిప్పు మాధవరావు , కట్ల సంతోష్ , జివ్వాజి నాగరాజు , అధికారులు వైరా తహశీల్దార్ శ్రీనివాసరావు , వ్యవసాయశాఖ అధికారి ఏడి కరుణశ్రీ , ఏఓ మంజుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్ద కాలంగా శిథిలావస్థలో ఆర్అండ్‌బి భవనాలు







**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఒకప్పుడు కళకళలాడే ఆర్అండ్‌బి కార్యాలయం నేడు వెల వెల పోతుంది. మండలంలో డి ఇ కార్యాలయం ఎప్పుడో ఏర్పాటు చేశారు. డిఇ, ఏఈ, జెఈ, వర్క్ ఇన్స్పెక్టర్లు, గ్యాంగ్ మెన్‌లు ఉండేవారు. కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, మధిర మండలాలు డి ఇ కార్యాలయం పరిధిలో ఉండేవి. ఈ మండలాల పరిధిలోని రోడ్లు అన్ని డిఇ పెనుబల్లి పర్యవేక్షణలోఉండేవి. అందు నిమిత్తం డి ఇ, ఏ ఇ, జె ఇ లు నివాసం కొరకు భవనాలు, విశ్రాంతి భవనం నిర్మించారు. దశాబ్దం నుండి కార్యాలయం లోని భవనాలు శిథిలావస్థలో ఉండి, ఎప్పుడు కూలిపోతాయో అన్నట్లు ఉన్నాయి. పాడు బడ్డ భవనాలు మరమ్మత్తులు సైతం అధికారులు పట్టించు కోవటం లేదు. డి ఇ పరిధి సైతం తగ్గించారు. ప్రభుత్వం కల్పిచుకొని నూతన భవనాలు, విశ్రాంతి భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థుల ఆరోగ్యాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఏ పిఓ బి రాహుల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారులో వివిధ ఆదివాసీ గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలను స్వీకరించారు. తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి మిగతా వాటిని సబంధిత అధికారులకు బట్వాడా చేశారు. గిరిజన సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించరాదని, వారి సమస్యలు పరిష్కరించిన నాడే వారి పురోభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. వ్యయ ప్రయాసలకు ఓర్చి వచ్చే వారి నమ్మకాని ఒమ్ముచేయకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, పరిష్కారానికి వీలుకానివాటిపై త్వరితగతిన నివేదకలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**- సర్వేలో ఏ ఒక్క ఇంటిని కూడా వదలొద్దు**

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**




**ప్రజాపక్షం/భద్రాచలం :** విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ , ట్రైబల్, మధ్యాహ్న భోజనం అమలులో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ వేణుగోపాల్, విద్యాచందన, ట్రైబల్ వెల్ఫేర్ డిడి మణెమ్మతో కలిసి జిల్లా అధికారులు,మున్సిపల్ కమీషనర్లు, తహశిల్దార్లు, ఎంపిడిఓలు, ఎంఇఓలతో ఆయన వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుత జిల్లాలోని అన్ని హాస్టళ్లు, మండలస్థాయి అధికారులు తమ పరిధిలోని హాస్టళ్లలను వ్యక్తిగతంగా పరిశీలించి పరిస్థితులు, సమస్యలపై ఫొటోలతో కూడిన నివేదికను అందించాలన్నారు. సరఫరా చేసే బియ్యం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించి రిజిష్టర్‌లో సంతకం చేయాలన్నారు. బియ్యంలో నాణ్యత ఉండాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. పరిసరాలతో పాటు వంట గదులు, స్టోర్ రూంలలో పరిశుభ్రత పాటించాలని, పాఠశాలల్లో ఉత్సాహ వంతులైన విద్యార్థినీ విద్యార్థులలో ఒకరిని లీడర్‌గా నియమించి పరిశుభ్రత పాటించే విధంగా చూడాలన్నారు. విద్యార్థులు తామే తమ ప్లేట్లను శుభ్ర పరుచుకోకుండా హాస్టర్ వర్కర్లు ప్లేట్లు శుభ్రం చేసి ఇవ్వాలన్నారు. హాస్టళ్లలో సోలార్ వాటర్ హీటర్లు ఎన్ని ఉన్నాయి. ఇంకా ఎన్ని అవసరం ఉందనే విషయాన్ని అధికారులు స్వయంగా పరిశీలించాలని ఆదేశించారు. బాలికల హాస్టళ్లలో మరుగుదొడ్లు సదుపాయాలపై నివేదికలు అందించాలని, అందికారులంత ఆమన్వయంతో పనిచేసి విద్యార్థులకు మేలురకమైన ఆహారం అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావారణాన్ని కల్పించాలని ఆదేశించారు. నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతా ప్రతిజ్ఞ చేయాలన్నారు. అదే విదంగా ఇంటింటి సర్వేలో ఏ ఒక్క గృహాన్ని వదలకుండా సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తూ డేటా ఎంట్రీ వేగవంతం చేయాలని, ఇందుకు అనుగుణంగా కంప్యూటర్ ఆపరేటర్లను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు.

# ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ , మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ఖమ్మం నగరంలోని నాల్గవ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.43 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన ప్రతిసారి అన్ని ప్రాంతాల ప్రజల అవసరాల మేరకు పనులు చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో ఎటువంటి రాజకీయ వివక్ష లేకుండా చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగర అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ వరకు మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ నాల్గవ డివిజన్‌లో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరమన్నారు. ఇక్కడ చాలా మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పరిశ్రమలలో పని చేస్తున్నారని వారికి ఈ హెల్త్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జ్యోతి రెడ్డి, కమర్తపు మురళి, డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే

# అమ్మి, మద్దతు ధర పొందాలి

## -కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని





**ప్రజాపక్షం/పాల్వంచ:** రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని సంగం గ్రామంలో పాల్వంచ సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని డిసిఎంఎస్ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావుతో కలిసి కూనంనేని ప్రారంభించారు. ఈసందర్భంగా కొత్వాల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్‌ఏ కూనంనేని మాట్లాడుతూ రైతులు దళారుల మాయ మాటలు నమ్మి, వారికి ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దాన్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యంపై క్వింటాలకు రూ 500 బోనస్ ఇస్తున్నదని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో డీసీవో ఖుర్షిద్, తహసీల్దార్ జీ వివేక్, సొసైటీ వైస్ ఛైర్మన్ కాంపెల్లి కనకేష్, ఇంచార్జి ఎంపీడీవో నారాయణ, వ్యవసాయ శాఖాధికారి శంబో శంకర్, పిఆర్ డీఈ రామకృష్ణ, సొసైటీ డైరెక్టర్లు బుడగం రామ మోహనరావు, కనగాల నారాయణ, చౌగాని పాపారావు, మైనేని వెంకటేశ్వరరావు, భూక్యా కిషన్, సిపిఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, పూర్ణచందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు నూకల రంగారావు, వై వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### 100 సంవత్సరాల

# సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య



**ప్రజాపక్షం/మణుగూరు:** 100 సంవతరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ పార్టీ అని, శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి మణుగూరు మున్సిపాలిటీలో లెనిన్ నగర్ థోట రమేష్ అధ్యక్షత వహించిగా, సమితి సింగారం గ్రామంలో వజ్రా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా బి. అయోధ్య హాజరై మాట్లాడుతూ పార్టీ పుట్టి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా గ్రామాల్లో సిపిఐ పార్టీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని దీనికోసం పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని దీనికోసం ప్రజలు కంగారు పడాల్సిన అవసరం లేదని ఇప్పటికే నాలుగు గ్యారెంటీ అమలు చేశారని, మిగిలిన సంక్షేమ పథకాలు కూడా అమలు చేస్తారన్నారు. తెల్ల రేషన్ కార్డు లేని వారు అనేకమంది ఉన్నారని వారందరికీ కూడా ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని అసలైన నిరుపేదలకు, ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వాలని, గత ప్రభుత్వంలో కొత్త పెన్షన్లు ఇవ్వలేదని ప్రభుత్వం వచ్చాక కొత్త పెన్షన్ల కోసం అనేకమంది ఎదురుచూస్తున్నారని వీరందరికీ కొత్త పెన్షన్ విధానం ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు., మున్సిపాలిటీలో అనేక గ్రామాల్లో సరైన పారిశుద్ధ్యం సరిగా చేయడం లేదని, సైడ్ డ్రయిన్ లేవని, సైడ్ డ్రైం నిర్మాణం చేపట్టాలని, విద్యుద్దీపాలు వెలగడం లేదని వీటన్నింటిపై అధికారులు చొరవ తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న లేకున్నా పేద ప్రజల సంక్షేమం కోసం సిపిఐ పార్టీ ఎల్లప్పుడు వారికి అండగా పనిచేస్తుందని అందుకోసం పార్టీని ఆదరించాలని వారు పిలుపునిచ్చారు. యువత ముందుకు రావాలని పార్టీ నిర్మాణం కోసం పనిచేయాలని దీని కోసం పెద్ద ఎత్తున గ్రామాల్లో కదలిక తీసుకురావాలని, యువత రాజకీయాలకు వచ్చినప్పుడే పార్టీ బలంగా ఉంటుందని పిలుపునిచ్చారు. వీరి వెంట సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు తోట రమేష్, తూపుడు శీను, కార్యవర్గ సభ్యులు కనితి సత్యనారాయణ, గిరిజన సమాఖ్య మణుగూరు మండల కార్యదర్శి వజ్రా వెంకటేశ్వర్లు, గొడిశాల వీరన్న, వేల్పుల మల్లయ్య, కనితి అనిల్ బూరుగుల నరసింహారావు, కార్యవర్గ సభ్యులు పెద్ద ఎత్తున, ప్రజలు హాజరైనారు. అనంతరం లెనిన్ నగర్, సమితి సింగారంలో నూతన కమిటీలు ఎన్నుకున్నారు.

## 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఒకే ఒక్క పార్టీ సిపిఐ : దండి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** తాడిత, పీడిత, కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల పక్షాన 100 సంవత్సరాలుగా అండగా నిలుస్తున్న ఒకే ఒక్క పార్టీ సిపిఐ అని ఆ పార్టీ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలోని కామంచికల్లు గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. తొలుత శత వసంతాల వేడుకలో భాగంగా కామంచికల్లు, ముత్యాల గూడెం, పడమటి తండా గ్రామాల్లో 134 మంది సభ్యుల నుంచి స్వీకరించిన సభ్యత్వాలను ఆ శాఖల ఆధ్వర్యంలో దండి సురేష్ కు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 100 సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీలో సభ్యత్వాన్ని స్వీకరించటం ఎంతో అదృష్టం అని అన్నారు. ఎంపీపీ, జడ్పిటిసి, ఎమ్మెల్యే పదవుల కంటే కూడా కమ్యూనిస్టు నాయకుడు అనే పదవి దక్కడం ఎంతో గొప్ప వరంగా అభివర్ణించారు. ఇది ఎర్ర జెండా పక్షాన ప్రజలకు మనం ఇచ్చే భరోసాలో నుంచి బాధ్యతగా దక్కుతుందన్నారు. డిసెంబర్ 26న నిర్వహించనున్న శతవసంత వేడుకలను ఎర్రజెండాల రెపరెపల నడుమ వాడవాడలో ఘనంగా నిర్వహించాలని కామ్రేడ్స్ కు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు వెంపటి సురేందర్, కే అశోక్ రెడ్డి, బొప్పి గాంధీ, ఎస్ కే షాహిని, కాలంగి ఉపేందర్, కొప్పుల వెంకటరమణ, అనంతుల శారద, జంగాల ఉపేందర్ ,చెరుకూరి ఉపేందర్, సత్తి నరేష్, యాట కొండయ్య, రాగం పుల్లారావు, వెంకటకృష్ణ, లింగనబోయిన నాగేశ్వరరావు, యాట సైదులు, మాలోతి శంకర్, మాలోతు రాజు, మాలోతు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంబులెన్స్ వితరణ

### -ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌ను అందించారు. ఈ అంబులెన్స్‌ను ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ తీసుకున్న ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. బ్యాంకుల పట్ల ప్రజలకు ఉన్న భయాలను తొలగించే దిశగా యూనియన్ బ్యాంక్ వ్యవహరించిందన్నారు. అప్పులు వసూళ్లే కాకుండా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సామాజిక బాధ్యతతో యూనియన్ బ్యాంక్ నిర్వహించిన కార్యక్రమం అభినందనీయమని, అంబులెన్స్ ఎంతో మందికి ప్రాణాపాయ స్థితిలో ఉపయోగపడుతుందన్నారు. బ్యాంకర్ల సాయంతో ప్రభుత్వాలు రూపొందించే పలు కార్యక్రమాలు ప్రజలకు ఆర్థిక వెసులుబాటును కల్పిస్తున్నాయన్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవలు అందిస్తున్న సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ప్రజల అత్యవసర సేవల కొరకు అంబులెన్స్‌ను వినియోగిస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ మేనేజర్ హన్మంతరెడ్డి, ప్రభుత్వ మెడికల్‌కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, బ్యాంక్ అధికారులు సర్వేష్, సుధాకర్‌రావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదుల నిరసన



**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ నాన్ క్యాడర్ పిపి పోస్టులను క్యాడర్ పోస్టులుగా మార్చవద్దని జీవో 16, 12ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ప్రకారం క్యాడర్ పోస్టులు 50 శాతం, నాన్ క్యాడర్ పోస్టులు 50 శాతం ఉండాలని తీర్పునిచ్చారని క్యాడర్‌కు సంబంధించిన వారు ప్రమోషన్ల కోసం ఉద్యోగ సంఘాలతో ఒత్తిడి చేసి జీవో నెం.16, 12ను తీసుకు రావడం జరిగిందన్నారు. నాన్ క్యాడర్ పోస్టు లేకుండా చేయాలని కుట్ర జరుగుతుందని ఇలా జరిగితే ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయన్నారు. కక్షి దారులకు న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వం న్యాయ నిపుణులను నియమించే అవకాశం ఉందని దీని వల్ల కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, ఐఏఎల్ జిల్లా కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, సీనియర్ న్యాయవాదులు నిరంజన్‌రెడ్డి, బిచ్చాల తిరుమలరావు, కె. వెంకటేశ్వరరావు, చింతనిప్పు వెంకట్, దిలీప్ చౌదరి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.